


# పిరికి వాడు

మోపిదేవి దుర్గా ప్రసాద రావు

బస్సు ప్రయాణంలో చల్లటిగాలి సుఖం అనుభవించాలంటే కిటికీ ప్రక్కనే కూర్చోవాలి. ఎప్పుడు ప్రయాణం చేసినా, వెధవది, కిటికీ ప్రక్క సీటు చచ్చినా దొరకదు. కానీ ఈరోజెందుకో నా అదృష్టం బాగుంది.

స్నేహితుడి పెళ్ళికి బందరు వెళ్ళవలసిన అవసరం కలిగింది. ప్రొద్దున్నే లేచి, ఆదరా బాదరా పనులన్నీ అవచేసుకొని బస్టాండుకు వెళ్ళాను. కౌంటర్లో నిలబడి టిక్కెట్టు తీసుకొని, బస్సెక్కేసరికి నా కోసమే నన్నట్టుగా ఒక సీటు ఖాళీగా కనిపించింది. వెంటనే కిటికీ ప్రక్కగా బైఠాయించాను.

బస్సు కదలడానికి అయిదు నిముషాలు ముందుగా ఒకాయన వచ్చి నా ప్రక్కనే కూర్చున్నాడు.

"ముందుగా, ఈ కిటికీ ప్రక్కగా నేను కూర్చున్నాను మాష్టారూ! బస్సు కదలడానికి యింకా టైముందికదా అని క్రిందకు దిగాను. ఇంతలో మీరు వచ్చి కూర్చున్నట్టున్నారు." సంభాషణ మొదలు పెట్టాడు.

కొంపదీసి యిప్పుడు నన్ను లేవమంటాడా అన్న భయం వేసింది. మరీ మర్యాదలేని మనిషిలా అనిపించాడు అత

గాడు. లేకపోతే "ఈ సీటు నాది" అని చెప్పడమేమిటి? అదే పరిస్థితులలో నే నుంటే, ప్రాణంపోయినా అవతలివాడితో అటువంటి విషయాలు మాట్లాడను. అత గాడికి మర్యాద తెలియకపోతే నాకు తెలి యదా? .... "లేచిపోదామా?" అను కున్నాను.

ఇంతలో అతనే, "ఇప్పుడు మిమ్మల్ని లేవమనడంలేదు మాస్టారూ! ఊరికే చెప్పాను." అనడంతో "బ్రతికానురా నాయనా!" అనుకుంటూ "థాంక్స్" అన్నాను.

విజయవాడ బస్టాండులోనుంచి బస్సు కదిలింది. ప్రొద్దున్నే, ఆరుగంటల సమయమేమో చల్లటిగాలి మొహానికి తగులుతోంది గాలివిసురుకు అప్పు డప్పుడూ వూపిరి పీల్చుకోవడం కష్ట మనిపించినా, హాయిగానే వుంది. రోడ్డు ప్రక్కగా వున్న పొలాలు. పరుగెత్తే గేదెలు, వాటి వెనుక పేడకోసం ఊపుకు పరుగుతో కుర్రవాళ్ళు, ప్రొద్దున్నే పొలా లకు పోతున్న రైతులు—చూసి, చూసి విసుగెత్తింది.

బస్సులోని జనంవేపు దృష్టి మళ్ళించి అందర్నీ పరికిలించి చూడసాగాను. నా ప్రక్కగా కూర్చున్న పెద్దమనిషి చూడ టానికి దర్జాగా వున్నాడు పంచె. లాల్చీ, పైన జరీ కండువా.... సన్నగా, ఒత్తుగా జుట్టు; అరడుగు పొడుగు; పొడుగుకు తగ్గ లావు .. ముక్కుమాత్రం ఎందుకో కొంచెం వంకర తిరిగింది. ఇందాకటిలా, బస్సులో "ఇది నా సీటు. అది నా సీటు" అని గొడవచేస్తే. ఎవడో ముక్కుమీద లాగి తన్నుంటాడనుకున్నాను.

వెనకవేపు సీట్లలో గ్లాస్కో లాల్చీలు. బుష్‌కోట్లు. వంటికి గట్టిగా పట్టుకుపోయిన పొడుగు లాగూలు వున్నాయి. అటువేపు సీట్లలో ఇద్దరు కుంకుమలు, తిలకాలు. చంద్రవంక బొట్లు; కంచి పట్టుచీరలు. బనారసు చీరలు, వాయిల్స్ కూర్చు న్నాయి. అలా అందర్నీ చూస్తున్న నా కళ్ళు ఇద్దరు ఆడవాళ్ళమీద ఆగిపోయాయి.

వాళ్ళిద్దరూ అక్కాచెల్లెళ్ళో లేకపోతే స్నేహితురాళ్ళో తెలియదుగానీ వేషాలు మాత్రం ఒక్కలా వున్నాయి. పెదాలకు రంగు వేశారు. బొడ్డుక్రిందకు చీర, ఉల్లి పొర జాకెట్టు, అందులోనుంచి అతి స్పష్టంగా కనిపిస్తున్న బాడీ ...అందం గానే కనుపిస్తున్నారు. సహజమైన అందం పెద్దగా లేకపోయినా, కట్టూ బొట్టూ తీరునుబట్టి ఆకర్షణీయంగా కనిపించొచ్చు అన్నవానికి వీళ్ళిద్దర్నీ ప్రతీకగా చూపిం చొచ్చు

వాళ్ళిద్దరూ ఏవిటో తెగ మాట్లాడు కుంటున్నారు. వాక్యం మొదలుపెట్టే టప్పుడూ ఆఖరు చేసేటప్పుడూ వొళ్ళంతా వూపుకుంటూ తెగ నవ్వుతున్నారు.

"వీళ్ళు ఎటువంటి మనుష్యులు? ... ఆడదానికి అంత విరగబాటా!" అను కున్నాను.

అప్రయత్నంగా అరుణ ఆకారం కనుపించింది. పెళ్ళయిన ఆరునెలల్లోనే ఏబ్రాసిలా తయారయిన పెళ్ళాం గుర్తుకు రాగానే మనస్సంతా వికారంగా తయారయింది.

పెళ్ళి చూపులప్పుడు అందంగానే కనిపించింది అరుణ. కానీ యిప్పుడా నాజూకూ, అందమూ మచ్చుకైనా లేవు. ఇంతా ఏడిస్తే పెళ్ళయి రెండేళ్ళయింది. పిల్లా పీచు కలగకముందే యిలా తయారయిందే, యిద్దరు పిల్లల తర్వాత ఎలా వుంటుందో? ఇంతకీ నా అదృష్టం అలా ఏడ్చింది.

"ఈ ఆడవాళ్ళిద్దరూ ఏఁమి తింటారో? ఎంతసేపు అలా మాట్లాడినా అలుపన్నది లేదు వీళ్ళకు!"

సుశీల గుర్తుకొచ్చింది, ఈసారి.

యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు నా క్లాసుమేటు సుశీల. అందంగా, చలాకీగా వుండేది. చదువు అయిపోగానే ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకుందా మనుకున్నాను. గాఢంగా, అతి గాఢంగా ప్రేమించాను.... కానీ, నా ప్రేమ సంగతి సుశీలకేనాడూ చెప్పలేదు. అసలు యూనివర్సిటీలో వున్న రెండు సంవత్సరాలలో ఎన్నిసార్లు మాట్లాడాను? ఒకరోజు వరండా మలుపు తిరుగుతున్నప్పుడు, అటువేపునుంచి వస్తున్న సుశీలను గ్రుద్దబోయి, నిలదొక్కుకొని 'సారీ' అన్నాను. అదే మొదటిసారి మాట్లాడటం; ఆఖరుసారికూడా అదే.

సుశీలతో పెళ్ళవనందుకు నేను విచారపడలేదు. మొదట్లో ఏదో అజ్ఞానంలో పడి అలా అనుకున్నాను కానీ, అసలు అటువంటి అమ్మాయిలతో ఎటువంటి సంబంధమూ పెట్టుకోకూడదు. అందరి మొగాళ్ళతోనూ పూసుకు తిరగడం, వుండుండి స్టేజెక్కి పాటలుపాడడం.... ఛ ఛ....

ఇప్పుడేం చేస్తోందో? ... ఏముంది, ఎవడ్నో పెళ్ళిచేసుకొని వాడి చెవులు పట్టుకొని ఆడిస్తూ, తనుమాత్రం జులాయి పోకిళ్ళు పోతూవుంటుంది. ఎంతైనా, నేను అదృష్టవంతుడ్ని.

'ఏముంది మాస్టారూ! పేపరు కొంచెం యిస్తారా?' అంటూనే నా చేతిలోని పేపరు తీసుకొని, అటువేపున్న ఆడవాళ్ల కందించాడు, ప్రక్కనున్న పెద్దమనిషి. ఇద్దరిలోనూ కొంచెం చిన్నదిగా కనిపిస్తున్న అమ్మాయి నవ్వుతూ పెదాలు కదిపింది.

బహుశా 'థాంక్స్' అనుంటుంది. వెధవ బస్సు.... వెధవ రొద. వినపడి చావలేదు. కంఠస్వరం ఎలా వుందో?

నేను కొన్న పేపరు వాళ్ళ చేతులలో నలిగిపోతుంటే కళ్ళప్పగించి చూస్తున్నాను. వాళ్లు ఏదో ప్రకటన చూస్తున్నారు. అందులో ఒకమ్మాయి తొడలపైకివున్న గౌను తొడుక్కొని, చేతిలో పౌడరు డబ్బా పుచ్చుకు నిలబడింది. ఆ ప్రక




టనలో అంత పరీక్షగా చూడవలసిన అంశమేమిటో నాకర్థం కాలేదు.... కొంప దీసి అటువంటి గౌను వేసుకోవాలను కుంటున్నారా?....

అరుణ సెకండ్ ఫారం ఫెయిలయ్యి చదువు మానేసింది. తెలుగు చదవడం. రాయడం వచ్చినా చేత్తో ఓ పుస్తకం పట్టుకొని చదవగా నేనెప్పుడూ చూడలేదు.

అవును. ఇంటి చాకిరితో సతమతమయ్యే ఆడదానికి పేపర్లు, వారపత్రికలు. నవలలు చదివే తీరికెక్కడుంటుంది? ఇదిగో, యిటువంటి మహాకర్తలే అటువంటి పనులన్నీ చేసేది. ఇంటిపనంతా పనిమనిషి మీద పెట్టి, మొగుడి సంగతి పట్టించుకోకుండా. పుస్తకం పట్టుక కూర్చుంటారు.

పిల్లలూ, నా భార్యా సాపత్య మెరుగరు?...నల్లగా, మురికి పట్టిపోయి మసిగుడ్డలా వుండే మాత్రమే...చీర వొంటినిండా కప్పుకుంటుంది. పరాయి మొగాళ్ళకు, చివరికి నాకు కూడా తన శరీరంలోని అంగుళం మేరైనా కనిపించనీయదు అదీ, అలా వుండాలి ఆడదంటే!... కొంచెం జిడ్డోడుతూ, మురికిగావున్నా అరుణ సాక్షాత్తు లక్ష్మిలా వుంటుంది. అసలు, లక్ష్మీదేవి మాత్రం నీటుగా, గోటుగా వుంటుందన్న గ్యారంటీ ఏమీ?

పేపరు చదివేసి అందిచ్చారు. ప్రక్క

తను అందుకొని చూడటం మొదలు పెట్టారు

ఈ అమ్మాయిలు సిగ్గూ, శరం లేకుండా మొగాళ్ళతో మాట్లాడ్తారేమిటి? ఇప్పుడు వీళ్ళు పేపరు చదవకపోతే కొంప మునిగిపోతుందా? పేపరు తీసుకొనేటప్పుడోసారీ ఇచ్చేటప్పుడొకసారి నవ్వుతూ 'థాంక్స్' అనడం. అసలు చదవాలని, పేపరు తీసుకోరు యిటువంటి వాళ్లు ఏదో మిషతో మొగాళ్ళతో మాట్లాడాలని బాధ.

చదివిన తర్వాత ముందు పేపరు నా కందించబోయారు. చూడనట్టుగా తల తిప్పుతుంటే, అప్పుడు ప్రక్కతను అందుకున్నాడు. లేకపోతే, ఛండాలం.... యిటువంటి షోకిల్లాంతో మాట్లాడడమేమిటి!

ఆడవాళ్ళంటే ఎలా వుండాలి!

మళ్ళీ, అరుణ ఆకారం ఎదురుగా నిలబడింది బంధువులుగానీ, నా స్నేహితులుగానీ యింటికివస్తే ఎప్పుడూ బైటకు రాదు. పడకగదిలో ముసుగుతన్ని పడుకుంటుంది. పొరపాటున యింటికొచ్చిన వాళ్ళ కళ్ళ పడవలసివస్తుందనే భయంతో వంటింట్లోకెళ్ళి కాఫీ కూడా తయారు చేయదు.... అదీ, మనిషంటే!

ఏంతైనా నేను అదృష్టవంతుడ్ని. భగవంతుడు దయుంచి అరుణలాంటి పెళ్లాన్నిచ్చి. యిటువంటి పోరంబోకు ఆడవాళ్ళనుండి నన్ను రక్షించాడు.

"ఏమండీ! మీరూ బందరుదాకా వస్తున్నారా" ప్రక్కతను అడిగిన ప్రశ్నకు అవునన్నట్టుగా తలాడించాను.

"నేను యింతవరకూ బందరు వెళ్ళ లేదండి. మా మేనత్తకూతురి పెళ్లికి బయల్దేరవలసి వచ్చింది ఇంతకీ పంపుల చెరువు ఎక్కడో మీకు తెలుసా?"


"పంపులచెరువు దగ్గర ఎవరింటికి వెళ్లాలి మీరు?" అన్నాను కుతూహలంగా. నా స్నేహితుడు సూర్యనారాయణ పెళ్లి కూడా అక్కడే.

అతగాడు చెప్పిన వివరాలనుబట్టి, నేనూ, అతగాడూ ఒకటే పెళ్ళికి వెళుతున్నట్టుగా తెలిసి సంతోషపడ్డాను.

"అరె, యింతసేపటినుండి చెప్పరేమిటండీ! నేనూ ఆ పెళ్లికే వెళుతున్నాను. సూరిగాడూ, నేనూ చిన్నప్పటినుండి స్నేహితులం మావాడి బంధువులు కాబట్టి మీరూ నాకు కావల్సినవారే" అంటూ కత్తు కలిపేశాను.

అతగాడి పేరు మాధవరావు. ఉద్యోగరీత్యా బొంబాయిలో వుంటున్నాడట. అతగాడూ, నేనూ చాలా విషయాలు మాట్లాడుకొన్నాం. అపోల్లో పదహేను, బంగ్లాదేష్, ఇండో-సోవియట్ ట్రీటీ—అన్నివిషయాలు దొర్లిపోయాయి మా సంభాషణలో.

అదేం ఖర్మో, నా అభిప్రాయాలు, మాధవరావు అభిప్రాయాలు ఏ ఒక్క విషయంలోనూ కలవలేదు. "అపోల్లో




పదిహేను వైజ్ఞానికంగా గొప్ప ఫీట్'' అతగాడంటే, దబ్బు దండగపని అని ఒక్క మాటలో కొట్టేశాను: ''బంగ్లా దేష్ విషయంలో మన పాలసీ నాకు నచ్చలేదు.'' అని అంటే నాకు నచ్చిం దన్నాను. అలాగే అతను ఇండో-సోవి యట్ ట్రీటీ విషయంలో ఆశావాదం వ్యక్త పరిస్తే, దాన్ని నేను ఖండించే శాను.

మా సంభాషణలో రెండు విషయాలు కనిపెట్టాను. ఒకటి — మాధవరావు వొట్టి పిరికివాడు. అతగాడి అభిప్రాయా లను నేను ఖండిస్తే నవ్వుతూ వూరు కుంటాడేగానీ ప్రతివాదన చేయడు. అసలే నేను ఎం.ఎ. సైకాలజీ వాడిని; వెంటనే కనిపెట్టేశాను అతగాడిపిన్కి ఎరువుతెచ్చుకొన్న భావాలని.

నేను కనిపెట్టిన రెండో విషయం— ఆ అమ్మాయిలిద్దరూ, కుతూహలంగా మావంకే చూస్తూ, మా సంభాషణ అంతా వింటూ మధ్య మధ్యలో నవ్వడం. నా అభిప్రాయాలు వాళ్ళకు నచ్చి వుండాలి: అందుకే మెచ్చుకోలుగా నవ్వారు.

వీళ్ళద్దరకూ నామీద అంత కుతూహలం దేనికో? .... వీళ్ళది ఎటువంటి క్యారెక్టరు? ఇద్దరు మొగవాళ్లు మాట్లాడు కొంటుంటే వినడం ఏమిటి? పైగా మధ్య మధ్యలో నవ్వడం.

ఈసారి మా సంభాషణ ఆడవాళ్ళ వేషభాషల మీదకు మళ్లింది. ఆడవాళ్ళు గౌనులు వేసుకున్నా, లంగాలు కట్టినా లేక లుంగీలు కట్టినా తప్పులేదన్నాడు

మాధవరావు. నాకు కోపం, జాలీ రెండూ వచ్చాయి — యితగాడింత పిచ్చివాడేమి టిన్నా అని.

చీరకున్న అందం మరిదేనికుంది? ఆ మధ్య ఎప్పుడో, ఎక్కడో చదివాను— అమెరికన్ అడవాళ్లు చీరల మీద మోజు పడుతున్నారని. ఆ మాటంటే మాధవ రావు "దానిదేముంది? మనం గౌనుల మీద మోజు పడుతున్నట్టుగా, వాళ్ళు చీరలమీద మోజు పడుతున్నారు." అన్నాడు.

చీరలో వున్న అందం చూసి వాళ్ళు మారిపోతున్నారని ఎంత చెప్పినా మాధవరావుకు సరిగ్గా అర్థంకాలేదు.

"మన దేశంలో ఆడవాళ్లు చెడిపోవ డానికి మగాళ్లే కారణమండి. ఒళ్ళంతా కనిపించే చీరలు కట్టి, మొగాళ్ళను ఆకర్షించడమే పనిగా పెట్టుకున్నారు చాలమంది." అన్నాను.

నేను ఎవరిగురించి చెప్పుతున్నానో మాధవ రావుకు అర్థంకాలేదు.

కొంచెం క్రిందకు వంగి, మాధవ రావుకు మాత్రం వినిపించేటంత మెల్లిగా అన్నాను.

"ఇందాక నా పేపరు తీసుకు చదివారే, ఆ ఆడవాళ్ళ మీద మీ అభిప్రాయ మేమిటి?"

మాధవరావు కొంచెం యిబ్బందిగా కదులుతూ, "అందంగానే వున్నారు." అన్నాడు.

"అదికాదండి నేను అడిగేది? వాళ్ళ క్యారెక్టరు ఎటువంటిదై వుంటుంది?" అని ప్రశ్నించి వెంటనే సమాధానంకూడా చెప్పేశాను.

"చెడిపోయిన .... వీళ్ళిద్దరూ, లేక పోతే పిర్రల మీదకు చీర, జాకెట్టుకూ చీరకూ మధ్య పదంగుళాలు బట్ట లేకుండా వదిలేయడం .... ఏమిటి? అదీకాకుండా, మీరు కనిపెట్టారో లేదో, వాళ్ళ వెంట మొగాళ్ళెవరూ లేరు ఇటువంటి వాళ్ళంతా ఒంటరిగా ప్రయాణాలు చేస్తూ వ్యాపారం సాగిస్తుంటారు. వీళ్లు ఖచ్చితంగా సంసార్లు మాత్రం కాదు."

ఎందుకో మాధవరావు నవ్వు తున్నాడు. దాంతో కొంచెం కోపం వచ్చి భారత స్త్రీ ఎలా వుంటాలన్న విషయం మీద మాట్లాడటం మొదలు పెట్టాను.

నేను చెప్పేవన్నీ వులుకూ, పలుకూ లేకుండా విని, ఆఖరున "మాస్టారూ! మీ వయస్సెంత?" అన్నాడు మాధవ రావు.

"ముప్పై. ఉన్నట్టుండి ఎందుకంత సందేహం వచ్చింది?"

"అహా, మరేంలేదు. మీరు మాట్లాడు తుంటే మా తాతగారు గుర్తుకొస్తు న్నారు." అంటూ పెద్దగా నవ్వసాగాడు మాధవరావు.

దొంగగాడిదకొడుకు. నేను మాట్లాడు తుంటే వాళ్ళ తాత గుర్తుకొస్తున్నాడా వెధవకి? అంటే నేనంత చాదస్తంగా

మాట్లాడుతున్నాననా వాడి అభిప్రాయం?

కాసీ, మాధవరావు నవ్వులో ఎక్కడా ఎగతాళి కనిపించలేదు నాకు. బహుశా, ఇంత చిన్న వయస్సులోనే మా తాతగారి కున్నంత అనుభవం వుంది మీకు' అని అతగాడి అభిప్రాయం అయివుంటుందని నచ్చ చెప్పుకున్నాను.

అయినా, యిటువంటి వెధవలతో మాట్లాడకుండా వుంటే మంచిది.

"దిగండి, దిగండి మాస్టారు! బందరు వచ్చేసింది." మాధవరావు కేకతో, చేతి సంచీ పుచ్చుకు దిగాను. ఎదురుగా కనిపిస్తున్న రిక్షావాడితో యిద్దరు మనుష్యులకు ఎంత తీసుకుంటావంటూ బేరం సాగించాను.

"ఆగండాగండి మాస్టారూ! ఒక రిక్షా సరిపోదు. రెండు కావాలి." అంటూ వచ్చాడు మాధవరావు. అతగాడి వెనకాల ఆ యిద్దరు ఆడవాళ్లు నిలబడి వున్నారు.

"ఇదిగో మా ఆవిడ. పేరు అనూరాధ. ఈ అమ్మాయి నా చెల్లెలు శ్యామల."

"నమస్తే" అంటూ చేతులు జోడించిన వాళ్లిద్దరినీ చూసి నిర్ఘాంత పోయాను. నోటివెంట మాట రాలేదు. అలాగే కళ్ళప్పగించి చూస్తున్నాను. తిరిగి నమస్కారం పెట్టాలన్న యింగితజ్ఞానం కూడా బుర్రలోంచి ఎగిరి పోయింది ఆ క్షణంలో.

"పదండి. బయల్దేరుదాం" అంటూనే "ఇంకో రిక్షానుకూడా పిలవరా, అబ్బీ." అంటూ రిక్షావాడిని పురమాయించాడు మాధవరావు.

అతగాడితో కలిసి ఒకే రిక్షాలో వెళ్ళడం ఎలాగో తెలియలేదు. బస్సులో దరిదాపుగా అరగంట అతగాడి పెళ్లాం గురించి, చెల్లెలి గురించి పిచ్చివాగుడు వాగాను....తీరా, కలిసి వెళ్లిన తర్వాత, ఏదో నెపంమీద పెళ్లిలో తంతాదేమో!... మనిషి బలంగా వున్నాడు.

"ముందు మీరు వెళ్ళండి. నాకు బజారులో కొంచెం పనివుంది. అది చూసుకు వస్తాను." నోరు పెగుల్చుకు అన్నాను.

"ఏమన్నా ప్రెజంటేషన్ కొనాలా? అయితే సరే. వెళ్తున్నాం." అంటూ వెళ్లిపోయాడు.

ఈరోజుకు బ్రతికిపోయాను. వెంటనే తిరుగు బస్సులో బెజవాడ వెళ్లిపోవడం మంచి దనుకున్నాను తర్వాత సూర్యనారాయణకు సర్ది చెప్పవచ్చు ననుకుంటూ కదలడానికి సిద్ధంగా వున్న బస్సెక్కాను.

